# నాడు వైఎస్సార్.. నేడు జగనన్న

- ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధికి చిరునామాగా మార్చారు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి విడదల రజిని
- లంకెలపాలెం, నమ్మిదొడ్డి ప్రాంతాల్లో యూపీహెచ్‌సీలు ప్రారంభం



లంకెలపాలెంలో నిర్మించిన యూపీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి రజిని, ఎంపీ సత్యవతి

అగనంపూడి: రాష్ట్రంలో ఆస్పత్రులు అభివృద్ధికి చిరునామాగా మారాయంటే ఆ ఘనత అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, నేడు పేదల పెన్నిధి జగనన్నకే చెందుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి విడదల రజిని అన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో సీఎం జగన్ తండ్రికి తగ్గ తనయుడన్నారు. జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెంలో రూ.కోటి 23 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హెల్త్ సెంటర్‌లో నిరంతరం డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఓపీ సేవలు అందిస్తారన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక చంద్రబాబు నాయుడు విషం చిమ్ముతున్నారన్నారు. అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ లంకెలపాలెం వాసుల చిరకాల స్వప్నం నేటికి నెరవేరిందన్నారు. జాతీయస్థాయిలో వైద్య రంగంలో అత్యుత్తమ సేవలకు గాను అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ, వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, పరవాడ ఎంపీపీ పైలా వెంకట పద్మాలక్ష్మి, 79వ వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు కింతాడ ఈశ్వరరావు, సుందరపు అప్పారావు, పచ్చికోరు రమణమూర్తి, యలమర్తి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

పెదగంట్యాడ: వైద్య రంగానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి విడదల రజిని అన్నారు. 77వ వార్డు నమ్మిదొడ్డిలో రూ.101.50లక్షలతో నిర్మించిన పది పడకల డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను అనకాపల్లి ఎంపీ బి.సత్యవతితో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో 528 యూపీహెచ్‌సీ కేంద్రాలను నాడు–నేడు పథకం కింద రూ.399 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. 10,032 పీహెచ్‌సీలు నిర్మిస్తున్నామన్నారు. ప్రతి పేద వాడికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. ప్రతీ 30 వేల జనాభాకు ఒక యూపీహెచ్‌సీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాడు–నేడు పథకం కింద పాతబడిన ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా నమ్మిదొడ్డి గ్రామంలో 10 పడకల ఆస్పత్రిని అన్ని రకాల సదుపాయాలతో తీర్చిదిద్దామన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో సుమారు 172 రకాల మందులు, ఓపీ సేవలు, 63 రకాల రక్త పరీక్షలు, మాతా శిశు సేవలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్ వంటి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జెడ్పీ పి.సింహాచలం, తహసీల్దార్ రమాదేవి, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుభిన, మలేరియా జిల్లా ఇన్‌చార్జి మణి తదితరులు పాల్గొన్నారు.



77వ వార్డులో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

## పూర్ణకు ఘన సత్కారం



పూర్ణను సత్కరిస్తున్న దేవన్‌రెడ్డి, నాయకులు

అగనంపూడి: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జి. పూర్ణానందశర్మ (పూర్ణ)ను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. అగనంపూడిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. పూర్ణ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



మహిళకు పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: సంక్షేమ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 71వ వార్డు శ్రామికనగర్, దత్తసాయినగర్, కుంచుమాంబ కాలనీ, ఆటోనగర్‌లలో సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను ఆయన కలుసుకుని, పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## పెన్షన్ కోసం మంత్రికి వినతి



మంత్రి రజినికి మొర పెట్టుకుంటున్న షేక్ బాను

పెదగంట్యాడ: తనకు ఎవరూ లేరని, 20 ఏళ్ల క్రితమే భర్త వదిలేశాడని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోమని షేక్ బాను అనే ఓ మహిళ ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఎదుట కన్నీళ్లు పెట్టుకుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు ప్రతి నెలా పింఛన్ ఇచ్చేవారని, ఏడాది తర్వాత ఇవ్వడం మానేశారని ఏకరువు పెట్టింది. జీవీఎంసీ 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్‌లో యూపీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రిని మంగళవారం అదే ప్రాంతానికి చెందిన షేక్ బాను కలిశారు. చెట్టుకింద చిన్న కమ్మల పాకను నిర్మించుకుని కొబ్బరి బొండాలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నానని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని విన్నవించింది. స్పందించిన మంత్రి రజిని వెంటనే ఆమెకు పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఆదేశించారు.

## 'కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం సాయంత్రం 4 గంటలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ప్రచార భేరీలో భాగంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రకటించిన 100 శాతం వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా, 800 రోజులుగా రిలే నిరాహార దీక్షలతో ప్రతిఘటిస్తున్నా పట్టించుకోకుండా, స్టీల్‌ప్లాంట్ అమ్మకానికే కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపడం అన్యాయమన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ బుధవారం జరిగే భారీ బహిరంగ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రసంగిస్తారని తెలిపారు. యు.రామస్వామి, జె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మలేరియాపై అప్రమత్తత అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

పెదగంట్యాడ: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్‌లో మంగళవారం ఆమె ప్రారంభించారు.

**పెదగంట్యాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..**

పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి ర్యాలీని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మానస, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**68వ వార్డులో..**

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మలేరియా వ్యాధిపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, పీడీ మహ్మద్ ఇస్మాయిల్, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎన్.రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు ఏ.వి.ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ



బహిరంగ సభ స్థలం వద్ద అధికారులతో చర్చిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

ఉక్కునగరం: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటగా ఆయన ఈ స్టేషన్‌కు వచ్చారు. ఏడీసీపీ గంగాధర్, సౌత్ డీసీపీ ఆనందరెడ్డి, ఏసీపీ టి.త్రినాథరావుతో వచ్చి ఆయన స్టేషన్ పరిసరాలను సందర్శించారు. అక్కడున్న చోరీ సొత్తు గురించి ఆరా తీసిన ఆయన, సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌లో సిబ్బంది సంఖ్య, వారి సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య, టౌన్‌షిప్‌లో క్వార్టర్లు అందులో ఉంటున్న నివాసుల గురించి ఆరా తీశారు. అంతకు ముందు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద బుధవారం నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని ఆయన సందర్శించారు. ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## కేంద్రం దిగొచ్చే వరకు ఉద్యమం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షల్లో 803వ రోజు మంగళవారం స్టీల్‌ప్లాంట్ చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## సెలెస్ట్‌లో ప్రహరీ తొలగింపు



ప్రహరీ తొలగించిన దృశ్యం

గాజువాక: పాతగాజువాక సమీపంలోని సెలెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లకు సంబంధించిన ప్రహరీని బుధవారం తొలగించారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణ అనుమతుల సమయంలో జాతీయ రహదారికి ఆనుకొని 75 సెంట్ల స్థలాన్ని జీవీఎంసీకి బిల్డర్ గిఫ్ట్‌గా ఇచ్చారు. మార్టిగేజ్‌లో ఉన్న ఫ్లాట్ల అమ్మకానికి అనుమతి ఇవ్వాలని బిల్డర్ కోరడంతో తమకు గిఫ్ట్‌గా ఇచ్చిన స్థలాన్ని అప్పగించాలని జీవీఎంసీ అధికారులు కోరారు. దీంతో బిల్డర్ సంబంధిత స్థలాన్ని అప్పగించడానికి ప్రహరీని తొలగించారు. కాగా, దీనిపై సెలెస్ట్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు చుట్టూ ప్రహరీ నిర్మించి ఫ్లాట్లను విక్రయించారని, ఇప్పుడు ప్రహరీని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని 70వ వార్డు కార్పొరేటర్ చందు దృష్టికి తీసుకెళ్లి, తమకు న్యాయం చేయాలని కోరారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ 33 సంవత్సరాలైన సందర్భంగా ఈడీ సీహెచ్.రవికుమార్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆర్టీసీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్‌ను సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.ధర్మారావు, రాష్ట్ర కార్యదర్శి బి.వై.రత్నం, జిల్లా అధ్యక్షుడు భీమయ్య పాల్గొన్నారు.

## మృతుని భార్యకు పరిహారం అందజేత



మృతుని భార్యకు కంపెనీ చెక్కును అందిస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి కంపెనీ నష్టపరిహారం అందజేసింది. వివరాలివి.. 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన బొడ్డేటి రవికుమార్ సింధియా ప్రాంతంలోని ఓ కంపెనీలో కార్మికుడిగా పని చేసేవాడు. కొద్ది రోజుల క్రితం విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు మరణించారు. అతని కుటుంబానికి న్యాయం చేసే విధంగా కార్పొరేటర్లు గుడివాడ అనూష, పి.వి.సురేష్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ కంపెనీ యాజమాన్యంతో సంప్రదింపులు చేపట్టారు. దీనిపై స్పందించిన కంపెనీ యాజమాన్యం మృతుని కుటుంబానికి రూ.15 లక్షలు నష్టపరిహారాన్ని అందించింది. ఆ చెక్కును మృతుని భార్యకు వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ మంగళవారం అందజేశారు. నాయకులు ఈటి శ్యామలరావు, గుడివాడ సంక్షేమ సేవా సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

అక్కిరెడ్డిపాలెం: శ్రీనగర్ అఫీషియల్ కాలనీలో మహిళ మెడలో గొలుసు చోరీ చేశారు. గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్ సుందరయ్యకాలనీ బస్టాప్ వద్ద నివాసం ఉంటున్న ద్రాక్షారపు రమణమ్మ అఫీషియల్ కాలనీలో హౌస్‌కీపింగ్ పనులు చేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వెళ్తున్న సమయంలో కాలనీలోని రోడ్డు నం.5 వద్ద ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు రమణమ్మ మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల తాడును తెంపుకొని పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరు కుని, వివరాలు సేకరించారు. క్రైం ఎస్ఐ మహేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

## 'జగన్‌తోనే భావితరాల భవిష్యత్తు'



67వ వార్డులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న పల్లా చినతల్లి

గాజువాక : జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని 67వ వార్డులో మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో జోగవానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు అచ్చన్నాయుడు, చిత్రాడ అప్పారావు, అన్నపూర్ణ, జోసెఫ్, వెంకటేష్, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

**69వ వార్డులో..**

అక్కిరెడ్డిపాలెం: భావితరాల భవిష్యత్తు జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యం అంటూ ప్రజలు నినదిస్తున్నారని 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు అన్నారు. వార్డు పరిధి వెంకటేశ్వరకాలనీలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, నాయకులు పాల్గొన్నారు.